నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

13 హైదరాబాద్, గురువారం 8 ఫిబ్రవరి 2024 HYDERABAD




# సంపులో పడి బాలుడి మృతి



ఖైరతాబాద్, ఫిబ్రవరి 7: ప్రమాదవశాత్తు సంపులో పడి ఓ బాలుడు మృతి చెందాడు. సైఫాబాద్ పోలీసుల కథనం ప్రకారం.. ఎల్బీస్టేడియంలో మంగళవారం రాత్రి స్పోర్ట్స్ డే వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు టోలీచౌకిలోని సక్సెస్ స్కూల్‌లో యూకేజీ చదువుతున్న మహ్మద్ ఆథిల్ (5) తల్లి షఫియా సుల్తానా, సోదరుడితో కలిసి వచ్చాడు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో రావడంతో అప్పటి వరకు తల్లితో ఉన్న ఆథిల్ తప్పిపోయాడు. వెతుకుతుండగా, ఓ వ్యక్తి వచ్చి బాలుడు సంపులో పడ్డాడని చెప్పడంతో హుటాహుటిన అక్కడి వెళ్లి బయటకు తీసి వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# 5 భాగాలు 9 అంశాలు..

### మూసీ సుందరీకరణపై మొదలైన కార్యాచరణ

### అంతర్జాతీయ ప్రమాణాలతో డిజైన్లు

### దేశ, విదేశాల ఆర్కిటెక్టులతో ప్రభుత్వం చర్చలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ) : మూసీ నదిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని సంకల్పించిన ప్రభుత్వం ప్రత్యేకంగా కార్యాచరణను రూపొందిస్తోంది. జంట జలశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల కింది భాగం నుంచి ప్రారంభమయ్యే మూసీ, ఈసీ నదుల తీర ప్రాంతం నగరం పరిధిలో సుమారు 59 కి.మీ మేర ప్రవహిస్తోంది. ఈ ప్రాంతాన్ని 5 భాగాలుగా గుర్తించారు. అందులో జంట జలాశయాల నుంచి బాపూఘాట్ వరకు, అదేవిధంగా పీర్జాదిగూడ నుంచి గౌరెల్లి బ్రిడ్జి వరకు ఉన్న ప్రాంతాన్ని సెమీ అర్బన్ ఏరియాగా, బాపూఘాట్ నుంచి హైకోర్టు వరకు, చాదర్‌ఘాట్ బ్రిడ్జి నుంచి నాగోల్ బ్రిడ్జి వరకు ఉన్న ప్రాంతాలను నెవర్ డెవలప్‌మెంట్‌గా, హైకోర్టు నుంచి చాదర్‌ఘాట్ బ్రిడ్జి వరకు ఉన్న ప్రాంతాన్ని ఓల్డ్ కోర్ సిటీగా గుర్తించారు. మూసీ సుందరీకరణకు మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు 'సిమ్యులేషన్ మోడల్ ఫర్ హైడ్రాలిక్స్ ' ప్రాజెక్టును రూపొందించేందుకు ఇప్పటికే కన్సల్టెన్సీలను ఆహ్వానించారు. ఇందులో ప్రధానంగా ఎకనామిక్ హబ్, టూరిజం హబ్, ఇంప్రూవ్డ్ యాక్సెసబిలిటీ, ఇంప్రూవ్ క్వాలిటీ లైఫ్, ఎన్విరాన్‌మెంట్, ఇంప్రూవ్డ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హెరిటేజ్ అండ్ కల్చర్ ప్రిజర్వేషన్, ప్రాపర్టీ వాల్యూ అండ్ టాక్సెస్, సిటీ ఇమేజ్ ఇలా పలు అంశాలన్నీ మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో ఉండేలా ప్రతిపాదనలు రూపొందించి, దానికి డిజైన్‌లు చేసి నిర్మాణం పనులు చేపట్టనున్నారు. ఇందుకోసం దేశ, విదేశాలకు చెందిన ఆర్కిటెక్టులతోనూ సంప్రదిస్తున్నారు.



# రోజూ ఇదే గోస!

నగరవాసులు ట్రాఫికర్‌తో బెంబేలెత్తుతున్నారు. నత్తకు నడక నేర్పినట్లుగా నగర రహదారులపై వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. దీంతో వాహనదారులకు నిత్య ప్రయాణం నరకప్రాయంగా మారింది. బుధవారం మాసబ్ ట్యాంక్ నుంచి మెహిదీపట్నం వైపు నెమ్మదిగా సాగుతున్న వాహనాలు చిత్రంలో చూడొచ్చు.

# ఆరోగ్యం.. ఆదాయం

### మెట్రో నగరవాసుల ప్రాధామ్యాలివే

### అమెక్స్ ట్రెండెక్స్ అధ్యయనంలో వెల్లడి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 7(నమస్తే తెలంగాణ) : ముంచుకొచ్చే ఆర్థిక ఇబ్బందులు, పొంచి ఉన్న అనారోగ్య సమస్యల ఛట్రంలో ఇరుక్కుపోకుండా ఉంటే చాలనే ధోరణి అత్యంత ప్రాధాన్యతగా మారుతుంది. ఇదే విషయాన్ని హ్యూమన్ బిహేవీయర్, హెల్త్, వెల్త్, కస్టమర్ బిహేవియర్‌పై అధ్యయనం చేసే అమెక్స్ ట్రెండెక్స్ సంస్థ సర్వేలో తేలింది. అమెరికన్ ఎక్స్‌ప్రెస్ ఆధ్వర్యంలో అమెక్స్ ట్రెండెక్స్ పేరిట సర్వే ఫలితాలను వెల్లడించింది. ఈ అధ్యయనం కోసం భారత్‌తోపాటు, ఆస్ట్రేలియా, కెనడా, జపాన్, మెక్సికో, యూకే, యూఎస్ వంటి దేశాల్లో వయోజనులను ప్రామాణికంగా తీసుకుని మానసిక ధోరణులను సేకరించారు. మెట్రో నగరాల్లో ఉండే నివాసితులు 85శాతం మంది కొత్త ఏడాది రెజుల్యూషన్‌లో 76శాతం మంది ఫిజికల్ వెల్‌నెస్, 69శాతం మంది పర్సనల్ ఫైనాన్స్‌లపై దృష్టి సారించినట్లుగా తేలింది. అదేవిధంగా 80శాతం మంది కొత్త ఏడాదిలో తీసుకున్న నిర్ణయాలను సమర్థవంతంగా పాటించాల్సిన ప్రణాళికలు చేసుకోగా, 73శాతం మంది ఆరోగ్యానిచ్చే ఆహారంపై ప్రాధాన్యతను గుర్తించారు. ఇక 80శాతం భారతీయులు ఆరోగ్యకరమైన పని వాతావరణాన్ని కోరుకుంటున్నారు. అదేవిధంగా గతేడాది కంటే 61శాతం మంది ఎక్కువగా క్రీడా పోటీలకు హాజరు కావాలని కోరుకున్నారు. దేశంలో ఎక్కడ క్రీడా పోటీలు జరిగిన వెళ్లేందుకు సంసిద్ధమేనని 97శాతం వ్యాఖ్యానించారు. ముఖ్యంగా భవిష్యత్తుకు భరోసానిచ్చేలా వ్యక్తిగత ఆర్థిక పరిపక్వత పొందాల్సిన అవసరం ఎంతైనా ఉందని వెల్లడైంది.





నాలెడ్జ్ సిటీలోని డచ్ ఐటీ సంస్థను సందర్శిస్తున్న నెదర్లాండ్స్ బృందం

# ఐటీకి కేరాఫ్ హైదరాబాద్

కొండాపూర్, ఫిబ్రవరి 7 : ఐటీ రంగంలో హైదరాబాద్ ఇండియాలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో మంచి గుర్తింపు పొందిందని, పెట్టుబడులకు, ఉపాధికి మంచి అవకాశాలున్నాయని నెదర్లాండ్స్ ఇండియా భూటాన్, నేపాల్ బ్రాండ్ అంబాసిడర్ మారిసా గెరార్డ్స్ అన్నారు. బుధవారం ఆమె నాలెడ్జ్ సిటీలోని డచ్ దేశానికి చెందిన జిబియా సీఎంఐటీ, ప్లానెన్ సాఫ్ట్‌వేర్ సంస్థలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తొలిసారి హైదరాబాద్‌కు వచ్చానని, ఇక్కడ వ్యాపార పెట్టుబడులను విస్తరించేందుకు స్థానికంగా ఉన్న పరిస్థితులు అధ్యయనం చేయడంతో పాటు ప్రభుత్వ యంత్రాంగాన్ని కలువనున్నట్లు తెలిపారు. డచ్‌కు చెందిన 20 ఐటీ సంస్థలు ఇక్కడ ఉన్నాయని పేర్కొన్నారు. జిబియా డచ్ సంస్థలో 3వేల మంది ఉపాధి పొందుతున్నారని, మరింత మందికి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు జిబియా సీఓఓ కిరణ్ కుమార్ తెలిపారు.

# కండ్లలో కారం కొట్టి.. చైన్ స్నాచింగ్



బాధితుడు గోవర్ధన్

వనస్థలిపురం/అల్వాల్, ఫిబ్రవరి 7 : వనస్థలిపురంలో బుధవారం ఓ వ్యక్తి కండ్లలో కారం కొట్టి మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కెళ్లారు. సాహెబ్‌నగర్ పద్మావతి కాలనీకి చెందిన గోవర్ధన్ స్థానికంగా కిరాణషాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం పాల ప్యాకెట్లు తీసుకువస్తుండగా, వీరాంజనేయ కాలనీ సమీపంలోకి రాగానే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చారు. అందులో ఒకరు కిందికి దిగి గోవర్ధన్ కండ్లలో కారం కొట్టి, మెడలో ఉన్న 2 తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. గోవర్ధన్ దుండగులను పట్టుకునేందుకు బైక్‌పై వెంబడించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**ఇంట్లో చొరబడి..:** అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భాటియా బేకరి సమీపంలోని ఓ ఇంట్లో దొంగలు చొరబడి శైలజ (36) అనే మహిళ కండ్లలో కారం చల్లి.. ఆమె మెడలోని 2 తులాల బంగారు మంగళసూత్రాన్ని లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. సమీపంలో సీసీ కెమెరాలు లేకపోవడాన్ని దొంగలు అనువుగా తీసుకున్నట్లు భావిస్తున్నారు.

# నగరం గొంతు ఎండనీయొద్దు

## బ్రాండ్ ఇమేజ్ పోనీయొద్దు

### హైదరాబాద్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

### సీఎం దృష్టికి పట్టణాభివృద్ధి ప్రణాళికలు

### హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

### గ్రేటర్ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష

సిటీబ్యూరో, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ) : విశ్వనగరంగా గ్రేటర్ హైదరాబాద్ బ్రాండ్ పోనీయొద్దని అధికారులకు హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో బల్దియాతోపాటు పలు విభాగాలతో కలిసి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాజధాని నగరంలో వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని జల మండలి ఎండీని ఆదేశించారు. రోజువారీగా శానిటేషన్, విపత్తుల నిర్వహణ, తాగునీటి మౌలిక వసతులు, శాశ్వత పరిష్కారానికి ఈ సమీక్ష సమావేశంలో అధికారులతో చర్చించారు. మహానగరానికి పొంచి ఉన్న తాగునీటి ఎద్దడిని ముందుగానే గుర్తించి నమస్తే తెలంగాణ ఇటీవల వెలుగులోకి తీసుకువచ్చిన అంశాలే ప్రధాన అజెండాగా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గ్రేటర్ అధికారులతో జరిగిన తొలి సమావేశంలోనే ప్రస్తావించడం విశేషం.

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ఏమాత్రం తగ్గకుండా అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలను సీఎం రేవంత్ దృష్టికి తీసుకుపోతామన్నారు. బల్దియా అభివృద్ధిపై ప్రభుత్వం సానుకూలంగానే ఉందన్నారు. రాష్ట్రంలో పట్టణ అభివృద్ధికి కేంద్ర సహకారం తీసుకుంటామన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రాజెక్టులకు రూ. 2వేల కోట్ల నిధులు అవసరమని అధికారులు తెలిపినట్లుగా మంత్రి వెల్లడించారు.

**పవర్ పాయింట్ ప్రజెంటేషన్..**

**గ్రేటర్ పరిధిలో చేపట్టిన, భవిష్యత్‌లో జరిగే పనులను విభాగాల వారీగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. ముఖ్యంగా ఎస్ఎన్‌డీపీ ద్వారా నాలా అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రికి వెల్లడించారు. ఇక వాటర్ బోర్డు ఎండీ సుదర్శన్ రెడ్డిని గ్రేటర్ జలమండలి స్వరూపాన్ని పేర్కొన్నారు. గతంలో చేపట్టిన 31 ఎస్‌టీపీల నిర్మాణాలు, వాటి పురోగతి, కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకంలోని మరో 35ఎస్‌టీపీలకు పంపిన ప్రతిపాదనలు, మురుగునీటి శుభ్రత, ఎస్‌టీపీలతో మూసీ నది అభివృద్ధి చేయవచ్చన్నారు.**

### అత్యవసర నిధుల కేటాయింపు

జిల్లాల ఇన్‌చార్జి మంత్రులకు రూ. 10 కోట్ల నిధులను సీఎం రేవంత్ కేటాయించారని, వాటితో అత్యవసరంగా చేపట్టే పనులు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అదేవిధంగా ప్రతి నెల 1-5 తేదీల్లోపు జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల జీతభత్యాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అత్యవసర నిధుల కేటాయింపులపై మంత్రికి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్ ఇమేజ్ పెంచేందుకు ప్రభుత్వానికి అన్ని విధాలుగా బల్దియా సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్ రెడ్డి, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి, అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, శివకుమార్ నాయుడు, జయరాజ్ కెన్నెడీ, సరోజ, ఉపేందర్ రెడ్డి, యాదగిరి రావు, సీఈ దేవానంద్, కిషన్, సురేష్ కుమార్, జోనల్ కమిషనర్లు అభిలాష అభినవ్, రవికిరణ్, పంకజ, వెంకన్న, సీఎంహెచ్ డాక్టర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, చీఫ్ ఎంటమాలజిస్ట్ డా. రాంబాబు, హౌజింగ్ ఎస్ఈ విద్యాసాగర్, జోనల్ అధికారులు పాల్గొన్నారు.



జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్ రెడ్డి, కమిషనర్ రొనాల్డ్ రాస్, జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి తదితరులు




# పోయింది వెయ్యే.. పోలీసులకెందుకు?

### సోషల్ మీడియాలో వ్యాపార ప్రకటనలు

### మహిళలను లక్ష్యంగా చేసుకొని మోసాలు

### తక్కువ మొత్తంలో ఎక్కువ మందిని లూటీ

### పోలీసులకు ఫిర్యాదు చేయని బాధితులు

## సైబర్ చీటర్స్‌కు కలిసొస్తున్న నయా దందా

*"ఇన్‌స్టాగ్రామ్, ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో బిజినెస్ ప్రమోషన్ల పేర్లతో సైబర్ నేరగాళ్లు నయా మోసాలకు తెరలేపారు. సైబర్‌నేరగాళ్లు ఇప్పటి వరకు ఎన్నో రకాలుగా మోసాలు చేస్తూ కోట్ల రూపాయలు కొట్టేస్తున్నారు. కానీ ఇప్పుడు సోషల్ మీడియాలో సింపుల్‌గా మహిళలనే లక్ష్యంగా చేసుకొని చిన్న మొత్తాలలో దోపిడీ చేస్తున్నారు. తక్కువ మొత్తంలో ఎక్కువ మందిని మోసాలు చేస్తుండడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. ఇదే సైబర్‌నేరగాళ్లకు కలిసొస్తోంది.*

*- సిటీబ్యూరో, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ)*


ప్రస్తుతం ఏ వ్యాపార ప్రకటనలకైనా సోషల్ మీడియానే పదునైన ఆయుధం. రోడ్డుపై బండి నడిపే వారి నుంచి కార్పొరేట్ వ్యాపారాల వరకు ఇదే సూత్రం. దీనినే ఆసరాగా చేసుకుంటున్న సైబర్ నేరగాళ్లు తక్కువ ధరకు వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు, బట్టలు, గృహోపకరణాలు విక్రయిస్తున్నామని ప్రకటనలు ఇస్తున్నారు. ఆయా ప్రకటనల కింద ఫోన్ నెంబర్, గూగుల్ పే, ఫోన్ పే నెంబర్లు ఇస్తూ కేవలం వాట్సాప్ కాల్స్‌లోనే మాట్లాడుతున్నారు. తక్కువ ధరకు ఇంటికి వస్తువులు డెలివరీ చేస్తామనగానే చాలా మంది మహిళలు రూ.500, రూ.1000, రూ.1500 చెల్లిస్తున్నారు. డబ్బులు చెల్లించిన తరువాత ఆయా వస్తువులు ఇంటికి రావడం లేదు. దీంతో తాము మోసపోయామని గుర్తిస్తున్నారు. కొందరు వాట్సాప్‌లో మాట్లాడుతూనే రేపు ఎల్లుండి అంటూ కాలయాపన చేస్తున్నారు. ఇంకొందరు మీరు కోరిన వస్తువు పంపించలేకపోతున్నాం..మీ డబ్బులో సగం తిరిగి పంపిస్తున్నామని మరో సగం నొక్కేస్తున్నారు. ఇలా చిన్న మొత్తాలలో ఒక్కొక్కరు మోసపోతుండడంతో ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. కానీ చిన్నమొత్తంలో ఎక్కువ మందిని లూటీ చేస్తూ సైబర్ నేరగాళ్లు ఆదాయాన్ని గడిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గుర్తుతెలియని వ్యక్తులు చెప్పే మాటలతో మోసపోవద్దని పోలీసులు సూచిస్తున్నారు. వీలైనంత వరకు దగ్గర్లో ఉన్న దుకాణానికి వెళ్లి వస్తువులను తీసుకోవడం మంచిదని, అలాంటప్పుడే ఏదైనా పొరపాటు జరిగినా దుకాణదారుడిని ప్రశ్నించేందుకు అవకాశముంటుందని సూచిస్తున్నారు.

### రైల్వే స్టేషన్లలో

# డిజిటల్ చెల్లింపులు

### యూటీఎస్, టిక్కెట్ వెండింగ్ మిషన్‌తోపాటు అందుబాటులోకి యూపీఐ సేవలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : డిజిటల్ కార్యకలాపాలు నిర్వహించడంలో దక్షిణ మధ్య రైల్వే జోన్ ముందంజలో ఉందని మంగళవారం రైల్వే అధికారులు తెలిపారు. అందులో భాగంగా యూటీఎస్ మొబైల్ యాప్, ఆటోమేటిక్ టిక్కెట్ వెండింగ్ మిషిన్లు, పాయింట్ ఆఫ్ సేల్ మిషిన్లతో పాటు యూపీఐ చెల్లింపులు వంటి వాటిని ఎస్‌సీఆర్ ప్రవేశపెట్టడం వంటి అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు జోన్ పరిధిలోని అన్ని ముఖ్యమైన నాన్-సబర్బన్ స్టేషన్లు, 1-4, సబ్-అర్బన్ క్యాటగిరి స్టేషన్లలోని అన్ని ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్, అన్ రిజర్వ్‌డ్ టిక్కెటింగ్ సిస్టమ్ కౌంటర్లలోని పీవోఎస్‌తో పాటు యూపీఐ చెల్లింపుల విధానాన్ని ఏర్పాటు చేసింది.




# మేడారానికి సూపర్ లగ్జరీ బస్సులు

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 7: మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరకు ఈ నెల 9 నుంచి ప్రతి రోజు టీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో మూడు బస్సులను నడుపుతున్నట్లు రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 నుంచి ఎంజీబీఎస్, జేబీఎస్‌ల నుంచి ప్రతి రోజు ఉదయం 6 గంటలకు, 6.30 గంటలకు, 7 గంటలకు మూడు సూపర్ లగ్జరీ బస్సులు బయలుదేరి ఉప్పల్, హన్మకొండ, వరంగల్ మీదుగా మేడారానికి చేరుకుంటాయన్నారు. ఈ ప్రత్యేక బస్సులలో పెద్దలకు రూ.750, పిల్లలకు రూ. 450 చార్జీలు నిర్ణయించామని పేర్కొన్నారు.